సాక్షి నాగర్‌కర్నూల్
శనివారం : 30 : మార్చి : 2024

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-35 (శనివారం సాయంత్రం)
సహర్ 4-50 (ఆదివారం తెల్లవారుజామున)



అందని బిల్లులు
ప్రభుత్వ శాఖల్లో నడిచే అద్దె వాహనాలకు ఏడాదికాలంగా బిల్లులు రావడంలేదు.
వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 42.4 /20.2
ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బీఎల్‌ఏల శిక్షణ శిబిరం విజయవంతం చేయండి



నాగర్‌కర్నూల్: ఎంపీ ఎన్నికల నేపథ్యంలో నాగర్‌కర్నూల్ నియోజకవర్గ బూత్ లెవల్ ఏజెంట్లకు ఈ నెల 30న శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు టీపీసీసీ సభ్యుడు వల్లభ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి జూపల్లి కృష్ణారావు, తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్‌చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి, ఎంపీ అభ్యర్థి మల్లురవితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతున్నట్లు చెప్పారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బూత్ లెవల్‌లో ఓటర్లు తమ ఓటులో పాల్గొనేలా చేయడంతో పాటు, ఓటరు లిస్టులో తప్పు ఒప్పులను సరిచూడటంపై బీఎల్‌ఏలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలియజేశారు.

సీఎంని కలిసిన టీపీసీసీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర వైస్‌చైర్మన్



నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రానికి చెందిన టీపీసీసీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర వైస్‌చైర్మన్ డాక్టర్ మాణిక్యాల చెన్నయ్య శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన టీఎస్ మెడికల్ సర్వీసెస్ మరియు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టుకు సంబంధించి నామినేట్ పోస్టుకు అవకాశం కల్పించాలని సీఎంని కోరినట్లు తెలియజేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాంచేస్తే సహించం

వనపర్తిటౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందే వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని.. కరువును సాకుగా చూపి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాంచేయాలని చూస్తే సహించమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలో వర్షాలు సమృద్ధిగా కురువకపోవడంతో కరువును చూస్తున్నామన్నారు. ప్రజలకు తాగునీటి కష్టాలు తలెత్తకుండా కర్ణాటక తరహాలో ప్రభుత్వం అన్నిరకాల చర్యలు చేపట్టిందని చెప్పారు. అవసరమైతే రైతుల బోరు బావులను లీజుకు తీసుకొని, తాగునీటి సమస్యను తీరుస్తామన్నారు. ఈమేరకు ప్రభుత్వం కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వనపర్తి నియోజకవర్గంలో 25,040 కిలోలీటర్ల నీటిని సరఫరా చేయాల్సి ఉండగా.. ప్రస్తుతం 19,435 కిలోలీటర్ల నీటిని అందిస్తున్నట్లు వివరించారు.

ఊరు బోరుమంటోంది

నల్లమలలోని చెంచుపెంటల్లో తాగునీటికి తిప్పలు



భౌరాపూర్ చెరువులోని నీటిని తాగుతున్న చిన్నారులు (ఫైల్)

- మల్లాపూర్ పెంటవాసులకు ఒక్క బోరే దిక్కు
- ఏళ్లుగా మరమ్మతుకు నోచుకోని వైనం
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లకే పరిమితమవుతున్న యంత్రాంగం

సాక్షి, నాగర్‌కర్నూల్: నల్లమల అటవీ ప్రాంతంలోని మారుమూల చెంచుపెంటల్లో నివసించే చెంచు కుటుంబాలకు వేసవిలో తాగునీటికి తిప్పలు తప్పడం లేదు. మండు వేసవిలో ముందస్తు ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో చెంచులు తాగునీటి కోసం తల్లడిల్లుతున్నారు. నల్లమల లోతట్టు ప్రాంతంలోని దాదాపు 40 చెంచుపెంటలున్నాయి. వీటన్నింటిలో కలిపి 8,450 మంది జనాభా ఉంది. వీటిలో మల్లాపూర్, అప్పాపూర్, భౌరాపూర్, రాంపూర్ చెంచుపెంటలు ప్రధానమైనవి. కాగా.. ఆదివాసుల తాగునీటి సౌకర్యం కోసం ప్రభుత్వం సోలార్ విద్యుత్‌తో పనిచేసే బోర్లను ఏర్పాటు చేసింది. అయితే పలు చెంచుపెంటల్లో ఏళ్లుగా కొన్ని బోర్లు మరమ్మతుకు నోచుకోక పనిచేయడం లేదు. చెంచుపెంటల్లో తాగునీటి సమస్య తీర్చేందుకు శాశ్వత ఏర్పాట్లు చేయాలని చెంచులు కోరుతున్నారు.

జల గోస

ట్యాంకర్ల ద్వారా పంపిణీ..



మల్లాపూర్ పెంటలో తాగునీటి కోసం అధికారులు ఏర్పాటు చేసిన నీటి ట్యాంకు

నల్లమలలోని చెంచు కుటుంబాలకు తాగేందుకు కనీసం సురక్షిత మంచినీరు కూడా కరువవుతోంది. వీరు నిత్యం దాహం తీర్చుకునేందుకు సోలార్ ద్వారా నడిచే బోరు నీరే దిక్కయ్యింది. ఇవి కూడా రిపేర్లకు నోచుకోక, సుదూరంలోని ఒక్క బోరుపైనే పదుల సంఖ్యలో కుటుంబాలు ఆధారపడుతున్నాయి. ఫలితంగా ప్రతిఏటా వేసవిలో తాగునీటికి తీవ్ర కటకట ఏర్పడుతోంది. చెంచుపెంటల్లో గత రెండేళ్లుగా కొత్తగా బోర్లు కూడా వేయడం లేదు. ఉన్న బోర్లు పనిచేయక, కొత్తవి వేయక తాగునీటికి చెంచులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాల్సి ఉండగా.. నీటి ట్యాంకర్ల ద్వారా పంపిణీ పేరుతో అధికారులు కాలం వెల్లదీస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.



మల్లాపూర్ పెంటలో మరమ్మతుకు నోచుకోని బోర్లు



వృథాగా ఉన్న నీటి ట్యాంక్

రూ.కోట్లు వెచ్చిస్తున్నా.. ఎక్కడిదక్కడే

చెంచుల అభివృద్ధికి గిరిజన సంక్షేమ శాఖ, ఐటీడీఏ, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్ తదితర శాఖల సమన్వయంతో ప్రభుత్వం ఏటా రూ.కోట్ల నిధులు ఖర్చు చేస్తోంది. తాగునీటి సౌకర్యం పేరుతో, ప్రత్యామ్నాయ ఏర్పాట్ల మాటున రూ.లక్షలు వెచ్చిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు మారడం లేదన్న విమర్శలున్నాయి. పదుల సంఖ్యలో బోర్లు వేసినా.. గొంతు తడవకపోవడం గమనార్హం. అప్పాపూర్ పంచాయతీ పరిధిలోని నట్టడవిలో కంపోస్టు షెడ్డు నిర్మాణం చేపట్టినా ఇప్పటి వరకు వినియోగంలోకి రాలేదు. చెంచు కుటుంబాల ఉపాధి, జీవన ప్రమాణాల స్థాయి పెంచేందుకు నిధులను ఉపయోగించాల్సి ఉండగా.. చాలా సమయాల్లో వృథా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొత్త బోరు వేయాలి..



మా పెంటలో అధికారులు మొత్తం నాలుగు బోర్లు వేశారు. వీటిలో ఒక్కటి మాత్రమే పనిచేస్తుంది. మిగతా బోర్లు ఎప్పుడో పాడైనా ఇప్పటి వరకు రిపేరు చేయలేదు. ఉన్న ఒక్క బోరు సైతం పది బిందెలకే సరిపోతోంది. మిగతా వారు నీరు లేక ఇబ్బందులు పడుతున్నాం. – దిగుర్ల లక్ష్మమ్మ, మల్లాపూర్ పెంట

తాగేందుకే సరిపోతలేవు..



గ్రామంలో బోర్లు వేసి వదిలేశారు. ఒక బోరుకు కేసింగ్ వేసి విడిచిపెట్టారు. మూడు బోర్లు పనిచేస్తలేవు. మిగిలిన ఒక్క బోరు నుంచి 5, 10 నిమిషాలకే నీళ్లు వస్తున్నాయి. తాగేందుకు కూడా నీళ్లు సరిపోవడం లేదు. ఇక పశువులకు నీళ్లు లేక నిత్యం ఇబ్బంది అవుతోంది. కొత్త బోరు వేసి నీటి సమస్య తీర్చాలి. – లింగయ్య, మల్లాపూర్ పెంట

‘బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం’



అభివాదం చేస్తున్న ఎంపీ రాములు, బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి భరత్‌ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్ తదితరులు

కొల్లాపూర్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని ఎంపీ రాములు, ఆయన తనయుడు బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి భరత్‌ప్రసాద్ అన్నారు. శుక్రవారం కొల్లాపూర్‌లోని మహెబూబ్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎంపీ. రాములు, భరత్‌ప్రసాద్‌తో పాటు టి.ఆచారి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. మూడు దశాబ్దాలుగా నేను ప్రజా సేవలో ఉన్నా.. ఇప్పుడు నా కుమారుడు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడని ఎంపీ రాములు అన్నారు. ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కొల్లాపూర్ అభివృద్ధికి దోహదపడే 167కే జాతీయ రహదారి కోసం నేనే కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీతో మాట్లాడానని చెప్పారు. జాతీయ రహదారి, వంతెన సాధనలో సుధాకర్‌రావు కృషి కూడా ఎంతో ఉందన్నారు. సాగు, తాగునీటికి కేంద్రంగా కొల్లాపూర్ మారిందని, భరత్‌ను గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా ముందుకు సాగుతాడన్నారు. పార్లమెంట్ అభ్యర్థి భరత్‌ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జాతీయ రహదారి నిర్మాణం, కృష్ణానదిపై వంతెన పనులు త్వరగా పూర్తి కావాలంటే కొల్లాపూర్ ప్రజలు బీజేపీకి ఓటేయాలని కోరారు. నేను గెలిస్తే కొల్లాపూర్‌కు మామిడి ఫ్రూట్ ప్రాసెసింగ్ సెంటర్ తీసుకొస్తానని, ఒక్క సంవత్సరంలో ఉపాధి అవకాశాలు కల్పించేలా వంద మందిని తీర్చిదిద్దుతానన్నారు. అచ్చంపేట నుంచి అలంపూర్ వరకు జాతీయ రహదారిని మంజూరు చేయిస్తానని తెలియజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు మాట్లాడుతూ బూత్ లేవల్లో పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని కోరారు. నాయకులు కళ్యాణ్, మంగ్యానాయక్, సందు రమేష్, శ్రీనివాస్‌యాదవ్, శేఖర్‌గౌడ్, భరత్‌చంద్ర, రోజారమణి, ధనుంజయ్‌గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పెంపు

దినసరి కూలీ రూ.272 నుంచి రూ.300కు పెంపు
- జిల్లాలో 3.63 లక్షల మంది కూలీలకు లబ్ధి
- ఉపాధి పెంచినా తగ్గుతున్న ఆసక్తి
- ఇతర పనుల వైపు మొగ్గుచూపుతున్న కూలీలు



ఊర్కొండ మండలం మాదారంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు(ఫైల్)

నాగర్‌కర్నూల్: ఉపాధి హామీ పథకంతో రోజువారి కూలీలకు మేలు చేయాలని, కూలీల చెల్లింపుల్లో పారదర్శకత ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా మరోమారు ఉపాధి హామీలో చెల్లించే కూలీని కేంద్ర ప్రభుత్వం పెంచింది. ఈ పెంచిన కూలీని ఏప్రిల్ నుంచి అమలు చేసేందుకు అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారు. 2005లో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం ప్రారంభం కాగా.. మొదట్లో రూ.87.50 చెల్లించేవారు. అయితే ప్రతియేటా పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయంతో ప్రస్తుతం కూలీలకు రూ.272 చెల్లిస్తున్నారు. కాగా ప్రస్తుతం పెంచిన కూలీతో ఉపాధి కూలీ రూ.300కు చేరుకుంది.



ఏప్రిల్ నుంచి అమలు..

జిల్లాలో మొత్తం 1.90లక్షల జాబ్ కార్డులు ఉండగా.. అందులో 3.63 లక్షల మంది కూలీలు పని చేస్తున్నారు. అయితే ఇందులో కేవలం 1.83 లక్షల మంది కూలీలు మాత్రమే ప్రస్తుతం యాక్టివ్‌గా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం పెంచిన కూలీతో 1.83 లక్షల మంది కూలీలకు మేలు జరిగే అవకాశం ఉంది. 2022 మార్చి వరకు కూలీలకు రోజుకు రూ.245 చెల్లిస్తుండగా.. ఇదే ఏడాది మార్చిలో రూ.12 పెంచి రోజువారి కూలీని రూ.257 కు పెంచింది. తరువాత 2023 ఏప్రిల్‌లో కూలీని మరో రూ.15 పెంచడంతో కూలీ రూ.272కు చేరుకుంది. ప్రస్తుతం రూ.28 పెంచడంతో కూలీ రూ.300కు పెరగనుంది. ఈ కూలీని ఏప్రిల్ నుంచే అమలు చేసేలా ఇప్పటికే అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారు. అయితే గతంలో ఫిబ్రవరి నుంచి జూన్ వరకు దినసరి కూలీతో పాటు వేసవి భత్యం కూడా చెల్లించడంతో 15 నుంచి 30 శాతం వరకు అధికంగా భత్యం అందేది. అయితే రెండు సంవత్సరాల నుంచి దీన్ని తొలగించారు. దీంతో కూలీలు ఉపాధి కూలీ పెంచినా పెద్దగా సంతృప్తి చెందడం లేదు.

జిల్లాలోని జాబ్‌కార్డులు 1.90 లక్షలు	
కూలీల సంఖ్య 3.63 లక్షలు	రోజూ పనిచేస్తుంది 1.83 లక్షల మంది కూలీలు

ఇతర పనుల వైపే మొగ్గు..

ఉపాధి హామీ కూలీ ప్రతియేటా పెంచుతున్నా.. కూలీలు మాత్రం ఉపాధి పనులపై ఆసక్తి చూపడం లేదు. గతంలో వేసవిలో కూలీలకు వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధి పనులపై ఆసక్తి చూపే వారు. అయితే ప్రస్తుతం రూ.272 కూలీ చెల్లిస్తున్నా.. పనుల కొలతల ప్రకారమే కూలీ ఇస్తుండడంతో కూలీలకు పెద్దగా గిట్టుబాటు కావడం లేదు. అదీ కాకుండా ప్రైవేట్ సెక్టార్‌లో కూలీల కొరత ఉండడం, కూలీ కూడా రూ.500 నుంచి రూ.600 ఇస్తుండటంతో కూలీలు ఇతర పనులపైనే ఆసక్తి చూపుతున్నారు. అంతే కాకుండా వ్యవసాయ పనుల సమయంలో కూలీలకు ఎక్కువ డిమాండ్ ఉండటంతో రూ.700 వరకు కూలీ చెల్లించడమే కాకుండా కూలీలు వెళ్లేదుకు వాహనాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఉపాధి పనులు మానేసి ఇతర పనులపై కూలీలు ఆసక్తి చూపుతున్నారు.

మరింత పెంచాలి



మా గ్రామంలో ఉపాధి హామీ పథకంలో ఫీడర్ ఛానల్ పనులు చేస్తున్నాం. కేంద్రం ఉపాధి కూలీని రూ.300 చేయడం హర్షించదగ్గ విషయం. కానీ మండుతున్న ఎండలు, ప్రైవేట్‌లో వస్తున్న కూలీని దృష్టిలో ఉంచుకుని మరింతగా పెంచాలి. – లక్ష్మయ్య, ఉపాధి కూలీ, గట్టురాయిపాకుల

కూలీలు వినియోగించుకోవాలి

ఉపాధి హామీలో పనిచేసే కూలీల దినసరి కూలీ రూ.272 ఉండగా రూ.28 పెంచి రూ.300 చేశారు. పెరిగిన కూలీ ఏప్రిల్ మాసం నుంచి అమలులోకి వస్తుంది. ఉపాధి హామీలో పనిచేసే కూలీలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. – ఓబులేసు, డీఆర్‌డీఓ

దయామయుడు ఏసుప్రభువు



ఎంబీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని ఎంబీ చర్చిలో శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చర్చి చైర్మన్ జోసెఫ్ మాట్లాడారు. లోకంలోని ప్రతిఒక్కరి పాపపరిహారార్థ నిమిత్తమై ప్రభువైన యేసుక్రీస్తు సిలువపై రక్తము కార్చాడని అన్నారు. అందుకు ప్రతిఒక్కరూ శుభ శుక్రవారంగా జరుపుకొంటున్నామని చెప్పారు. అనంతరం ఏసుక్రీస్తు సిలువ వేసిన సమయంలో మాట్లాడిన 7 మాటలను గురించి సంఘం పెద్దలు క్రైస్తవులందరికీ వివరించారు. ఈ ఆరాధన కార్యక్రమంలో సంఘ పెద్దలు, మహిళలు, యువకులు సుమారు 250 మంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

రేపు కిక్‌బాక్సింగ్ రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు

మహబూబ్‌నగర్ క్రీడలు: స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ మహబూబ్‌నగర్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 31న జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ ఆవరణలో జిల్లాస్థాయి కిక్‌బాక్సింగ్ టోర్నమెంట్, రాష్ట్రస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు కె.రవికుమార్, ఎ.రవినాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో ఆయా విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారు వచ్చేనెల 1, 2 తేదీల్లో వనపర్తిలో జరగనున్న రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ టోర్నమెంట్‌కు ఎంపికవుతారని వారు పేర్కొన్నారు.

డొనేషన్ల పేరుతో ఆర్‌జీ ట్యాక్స్ వసూలు

- పార్లమెంట్ ఎన్నికల కోసం వ్యాపారులపై ఒత్తిళ్లు..
- రాష్ట్రంలో దొంగల పాలన పోయి.. గజ దొంగల పాలన వచ్చింది
- మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌లో భారీ మెజార్టీతో గెలుస్తాం
- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- పార్టీ ముఖ్య నేతలతో ఎన్నికల ప్రచార తీరుపై సుదీర్ఘ సమీక్ష



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, చిత్రంలో డీకే అరుణ, బంగారు శ్రుతి, తదితరులు

పాలమూరు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో డొనేషన్లు అంటూ తెలంగాణ వ్యాప్తంగా ఆర్‌జీ(రాహుల్‌గాంధీ) ట్యాక్స్ వసూలు చేస్తూ వ్యాపారులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ముఖ్యనేతలు, నాయకులతో పాటు మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులతో కిషన్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో తీసుకోవాల్సిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా బీఆర్‌ఎస్ బాటలోనే నడుస్తోందని, గతంలో కేసీఆర్ కుటుంబసభ్యులు దోచుకుంటే ఇప్పుడు రాహుల్‌గాంధీ కుటుంబం దోచుకుంటుందని విమర్శించారు. కంపెనీలతో పాటు ఏ ఒక్కరిని వదలకుండా ఆర్‌జీ ట్యాక్స్‌ను ప్రజలపై వేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో ఫోన్ ట్యాంపరింగ్ వ్యవహారంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో నడవడం లేదని, ఎఫ్‌ఐఆర్‌లలో అసలు సూత్రధారులు కన్పించడం లేదన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం కరవు తాండవం చేస్తోందని, తాగునీటి ఎద్దడి, విద్యుత్ కోతలు అధికమయ్యాయని, మొదట వీటిని ఎలా అధిగమిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో దొంగలు పోయి.. గంజ దొంగలు అధికారంలోకి వచ్చారన్నారు. నియంతృత్వ పాలన నుంచి విముక్తి కోసం, కేసీఆర్‌ను ఓడించాలనే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారన్నారు. ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్‌లో ఓవైసీ సీటు సైతం బీజేపీ సొంతం చేసుకోబోతుందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి ఎంపీగా పోటీ చేసేందుకు అభ్యర్థులు కూడా దొరకడం లేదని, టికెట్ ఇచ్చినా వారు పారిపోతున్నారని, కేసీఆర్ ఫోన్ వస్తుందని భయపడే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ 14 సీట్లు గెలుస్తామని ఖమ్మం, నల్లగొండలో కూడా సానుకూలంగా ఉందన్నారు.

రాష్ట్రంలో మోదీ ప్రభంజనం

రాష్ట్రంలో మోదీ ప్రభంజనం మొదలైందని, ఈ దేశానికి ఎవరు ప్రధాని కావాలో ప్రజలు నిర్ణయించుకున్నారని కేంద్రమంత్రి అన్నారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుస్తారని చెప్పారు. బీజేపీ నుంచి ఎలాంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన పాలమూరు నుంచే ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోందని, ఇప్పుడు కూడా తెలంగాణ పార్లమెంట్ స్థాయి సమీక్షలు సైతం ఇక్కడి నుంచే ప్రారంభించుకుంటున్నట్లు తెలిపారు. దేశంలో కనుచూపు మేర కూడా మోదీకి పోటీ, ప్రత్యామ్నాయం కన్పించడం లేదని, ఈసారి ఎన్డీఏ కూటమి 400 సీట్లు గెలవడం ఖాయమన్నారు.

బెదిరించి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారు..

గత ప్రభుత్వ హయాంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అవినీతి జరిగిందన్న సీఎం రేవంత్‌రెడ్డి.. గత ప్రభుత్వం అవినీతి బయట పెడుతాం అంటూ.. ఇప్పుడు భయపెట్టి ఆ నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని కేంద్రమంత్రి ధ్వజమెత్తారు. లోక్‌సభ ప్రచార కార్యక్రమాలు త్వరలో అధికారికంగా నిర్వహిస్తామని, దేశంలో బీజేపీ ప్రచారంలో చాలా ముందంజలో ఉందని తెలిపారు. అంతకుముందు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, బీఆర్‌ఎస్ నేత రాములు, నాయకులు కృష్ణ, నాగరాజు యాదవ్ కేంద్రమంత్రి సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ, నేతలు బంగారు శ్రుతి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, బాలరాజు, పద్మజారెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, ఎగ్గని నర్సింహులు, కృష్ణవర్ధన్‌రెడ్డి, డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

అమ్రాబాద్: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. మండలంలో నమోదు అవుతున్న కేసులు, శాంతిభద్రతలు తదితర విషయాలపై ఎస్‌ఐ రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి న్యాయం జరిగేలా కృషిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సీఐ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.



అమ్రాబాద్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి


బుచ్చమ్మ (ఫైల్)

గోపాల్‌పేట: విద్యుదాఘాతంతో ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గోపాల్‌పేటకు చెందిన పలుస బుచ్చమ్మ (72) కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటోంది. బుధవారం బంధువుల పెళ్లి ఉండటంతో గోపాల్‌పేటకు వచ్చింది. రెండు రోజుల పాటు గ్రామంలోనే ఉన్న ఆమె.. ఇంటి ఆవరణలో ఉన్న సింగిల్‌ఫేజ్ మోటారును ఆన్ చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై కిందపడింది. ప్రమాదంలో ఆమె తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందిందని గ్రామస్తులు తెలిపారు.

బైక్ టైరులో చున్నీ చుట్టుకొని వివాహిత దుర్మరణం

దేవరకద్ర రూరల్: బైక్ టైరులో చున్నీ చుట్టుకుని వివాహిత మృతిచెందిన ఘటన దేవరకద్ర మండలం కోయిల్‌సాగర్ గ్రామ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కర్నూల్ ప్రాంతానికి చెందిన రాజు – మాధవి (36) దంపతులు మరికల్ మండలంలో నివాసముంటున్నారు. జీవనోపాధి నిమిత్తం వారు ఊరూరు తిరిగి, గ్యాస్ స్టవ్‌లు రిపేరు చేసేవారు. ఈక్రమంలో కోయిల్‌సాగర్‌కే మాధవి తన సోదరుడితో కలిసి బైక్‌పై వెళ్తుండగా.. మార్గమధ్యలో చున్నీ బైక్ వెనుక టైరులో చుట్టుకుంది. దీంతో బైక్ పైనుంచి కిందపడిన ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి, చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై ఎస్‌ఐ నాగన్నను సంప్రదించగా, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

దామరగిద్ద: మండలంలోని సజనాపూర్‌లో పేకాట స్థావరంపై శుక్రవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకుని, వారి నుంచి రూ.5,820, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఏడాదిగా అందని బిల్లులు


పాత కలెక్టరేట్ ఆవరణలో సమ్మె చేస్తున్న అద్దె వాహనదారులు (ఫైల్)

- జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో 150 అద్దె వాహనాలు
- ప్రతి నెలా ఒక్కో వాహనానికి రూ.33వేల బిల్లు
- అప్పుల పాలవుతున్న అద్దె యజమానులు
- రూ.30 లక్షల బిల్లులు పెండింగ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సంవత్సర కాలంగా బిల్లులు రాక ప్రభుత్వ శాఖల్లో నడిచే అద్దె వాహదారుల బతుకులు దీనంగా మారాయి. ప్రభుత్వ ఉద్యోగులకు ఒక్క నెల జీతం కాస్తా ఆలస్యం అయితేనే అల్లాడిపోతారు. ఇది ఒక్క ప్రభుత్వ ఉద్యోగి పరిస్థితి మాత్రమే కాదు ప్రతి ఒక్కరిది. అలాంటి అద్దె వాహనదారులకు ఏడాదిగా ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

అండర్ ప్రాసెసింగ్..

జిల్లా వ్యాప్తంగా 150 అద్దె వాహనాలు ప్రభుత్వ శాఖల్లో నడుస్తున్నాయి. ఇందులో డీఆర్‌డీఓ శాఖలోని డీపీఎం, ఈజీఎస్, అకౌంట్స్ లాంటి వారికి వాహనాలు ఉన్నాయి. దీంతో పాటు పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, ఎస్సీ సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, తహసీల్దార్లు, ఎంపీడీఓలకు వాహనాలు నడుస్తున్నాయి. ఆయా శాఖ అధికారులు బిల్లులు చేసిన ఈ–కుబేర్‌లో పెండింగ్ అని, అండర్ ప్రాసెసింగ్ చూపిస్తుందని వాహనదారులు వాపోతున్నారు.

అన్ని శాఖల్లో బిల్లులు పెండింగ్..

సివిల్ సప్లయి శాఖ 13 నెలలు, గిరిజన సంక్షేమ శాఖలో 12 నెలలు, డీపీఓ 18 నెలలు, పరిశ్రమ శాఖలో 9 నెలలు, ఈజీఎస్ 14 నెలలు, ఫిషరీస్ ఆరు నెలలు, ఇరిగేషన్ 14 నెలలు, ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ 24 నెలలు, జడ్చర్ల ఎంపీడీఓ 12నెలలు, ఐసీడీఎస్ మద్దూరు ప్రాజెక్ట్ 12 నెలలు, మిడ్జిల్ ఎంపీఈఓ 8 నెలలు, డీఆర్‌డీఓ(ఐకేపీ)లో నడిచే వాహనాలకు 10 నెలల నుంచి బిల్లులు రావడం లేదు.

అందాల్సిన బిల్లులు రూ.30లక్షలు

నెల మొత్తం వాహనం నడిస్తే వీరికి రూ.33 వేల బిల్లును ప్రభుత్వం నుంచి చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో 2 శాతం పన్ను కట్ చేసుకుని రూ.32,620 మాత్రమే వాహనదారునికి వస్తుంది. ఇందులో వాహనానికి ఏమైన మరమ్మతు వచ్చిన, ప్రతి రోజు డిజిల్‌ను వాహనదారులు భరించాల్సి ఉంటుంది. ఇప్పటి దాక మొత్తం సుమారుగా రూ.30 లక్షల దాక బిల్లులు రావాల్సి ఉందని యూనియన్ నాయకులు చెబుతున్నారు. ఈ మొత్తం ఇంకా ఎక్కువ సంఖ్యలోనే ఉంటుందని అంటున్నారు.

గతంలో సమ్మె..

బిల్లులు చెల్లించాలని, అధికారులు వేధింపులు ఆపాలని గతంలో వాహనాలు నిలిపివేసి వారం రోజుల పాటు సమ్మె చేశారు. దిగి వచ్చిన అధికారులు పెండింగ్‌లో బిల్లులు లేకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో విరమించారు. దీంతో పాటు అనేక సార్లు వచ్చిన ప్రతి కలెక్టర్‌ను, జిల్లా అధికారులను కలిసి వినతిపత్రాలు ఇస్తూనే ఉన్నారు. అయినా సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎలా బతకాలి



బిల్లులు చెల్లించాలని ఎన్ని సార్లు ఉన్నతాధికారులకు, ఆయా శాఖ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చిన ప్రమోజనం లేకుండా పోయింది. ఏడాది నుంచి బిల్లులు రాకుంటే ఎలా బతకాలి. బిల్లులు ఇప్పించాలని యజమానులు మాపై ఒత్తిడి తెస్తున్నారు. వస్తాయని వారిని సముదాయించుకుంటూ ముందుకు పోతున్నాం. బిల్లులు రాకుంటే ఎన్ని రోజులని చూస్తారు. – కేశవులు, డ్రైవర్

దుర్భర జీవితం



నెలల తరబడి వాహనాలకు బిల్లులు రాకపోవడంతో దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నాం. బిల్లులు రాకుంటే మా కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి. మా గోడు ఎవరికి చెప్పినా తీరేటట్లు కనిపించడం లేదు. దయ చేసి మాకు రావాల్సిన బిల్లులను వెంటనే ఇప్పించాలి. –ధర్మానాయక్, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు

పండుగకు పస్తులు



బిల్లులు నెలల తరబడి రాకపోవడంతో వాహనాలు నడిపించేందుకు అప్పులు చేస్తున్నాం. రంజాన్ మాకు పెద్ద పండుగ. ఈ నెల అయినా బిల్లులు వస్తే పండుగను సంతోషంగా చేసుకుంటాం. లేదంటే పండుగ పూట కుటుంబమంతా పస్తులు ఉండాల్సిందే. – సయ్యద్ సలీం హుస్సేన్, జిల్లా కార్యవర్గసభ్యుడు

బిల్లులు విడుదల చేయాలి..



అధికారులను ఎన్ని సార్లు కలిసిన బిల్లులు చేశామని చెబుతున్నారు. ట్రెజరి అధికారులను అడిగితే మావద్ద ఏమి లేదని ఈ–కుబేర్‌లో పెండింగ్‌లో ఉందని చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బిల్లులు విడుదల చేయాలి. –అబ్దుల్ ఖాదర్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు

సేవాలాల్ విగ్రహం అప్పగించండి


ఆందోళన చేస్తున్న గిరిజనులు

- అటవీ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన

కొల్లాపూర్: ఎత్తం గట్టు సమీపంలో ఇటీవల ప్రతిష్ఠించిన సంత్ సేవాలాల్ విగ్రహాన్ని అటవీ అధికారులు తొలగించారు. దీన్ని నిరసిస్తూ పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం సాయంత్రం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు మాట్లాడారు. గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ విగ్రహాన్ని ఫారెస్టు అధికారులు తొలగించడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ స్థలంలో గిరిజనులు విగ్రహ ప్రతిష్ఠ చేశారన్నారు. ఆ స్థలం అటవీశాఖ పరిధిలో ఉంటే న్యాయపరంగా చర్యలు తీసుకోవాలి కానీ, విగ్రహాన్ని ఎలా ఎత్తుకెళ్తారన్నారు. డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్, సీఐ మహేష్ అక్కడికి చేరుకొని నాయకులతో మాట్లాడారు. రెండు రోజుల్లో విగ్రహం అప్పగించేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో నాయకులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, సందు రమేష్, శేఖర్‌గౌడ్, భరత్‌చంద్ర, రోజారమణి, సాయికృష్ణగౌడ్ తదితరులున్నారు.

‘టెట్’ సందేహాలను నివృత్తి చేయాలి



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

నాగర్‌కర్నూల్: రాష్ట్ర విద్యాశాఖ ఇటీవల విడుదలచేసిన టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ – 2024పై ఉపాధ్యాయుల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఆర్.కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో విడుదల చేసిన అన్ని నోటిఫికేషన్లలో 23 ఆగస్టు 2010కు ముందు సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ అర్హత మినహాయించబడిందని.. ప్రస్తుత నోటిఫికేషన్‌లో ఆ నిబంధన తొలగించారని పేర్కొన్నారు. అయితే ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఎవరు రాయాలి.. ఏ పేపర్ రాయాలన్న దానిపై స్పష్టత లేదని తెలిపారు. ఇది ఉపాధ్యాయులను తీవ్ర గందరగోళానికి గురిచేస్తోందన్నారు. ఈనెల 27నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు మాత్రమే దరఖాస్తు గడువు ఉందని.. ఉపాధ్యాయుల్లో నెలకొన్న సందేహాలను త్వరగా నివృత్తి చేయాలన్నారు. దీనిపై ప్రజాప్రతినిధుల జోక్యం కోరాలన్నా.. ఆందోళన చేపట్టాలన్నా ఎన్నికల కోడ్ ఆటంకంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులే స్పందించి, స్పష్టత ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ఉపాధ్యాయ, ఉద్యోగులు పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానం రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీధర్‌శర్మ, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.చిన్నయ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.రమాదేవి, కోశాధికారి జె.బాల్‌రాజు, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎ.వెంకటేశ్వర్లు, కార్యదర్శులు ఎస్.చంద్రశేఖర్, పి.మహేశ్‌బాబు, కె.శంకర్, ఆర్.లక్ష్మణ్, ఎం.శ్రీనివాస్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఎస్.నెహ్రూప్రసాద్ తదితరులు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ కీలక పాత్ర


మాట్లాడుతున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ కీలకపాత్ర పోషించాలని రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డితో కలిసి మహబూబ్‌నగర్ యువజన కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో యువజన విభాగం ప్రధాన భూమిక పోషించిందన్నారు. అప్పటి ప్రభుత్వం అవలంబించిన ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తుచేశారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి గెలుపునకు యువజన కాంగ్రెస్ ముందుండి పనిచేయాలని కోరారు. కేంద్రంలో రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా ముందుకుసాగాలన్నారు. అంతకుముందు ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో యువత ముఖ్య భూమిక పోషించాలన్నారు. కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో తగ్గిన గుర్తింపు ఉంటుందన్నారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి సుర్విద్ వివేది, పార్లమెంట్ ఇన్‌చార్జి చైతన్య కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వాసుయాదవ్, మహబూబ్‌నగర్ అసెంబ్లీ అధ్యక్షుడు జె.చంద్రశేఖర్, కోట్ల రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జవాన్‌కు కన్నీటి వీడ్కోలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు


సెల్యూట్ చేస్తున్న జవాన్లు


అంతిమయాత్రలో పాల్గొన్న జనం

పాలమూరు: హన్వాడ మండలం వేపూరు గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ విష్ణుకు కన్నీటి వీడ్కోలు పలికారు. శుక్రవారం రాత్రి కోల్‌కతా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో స్వగ్రామానికి తీసుకొచ్చారు. ఈసందర్భంగా వేలాది మంది యువకులు జవాన్ విష్ణు అంతిమయాత్రలో పాల్గొని, అశ్రునయనాల మధ్య ఆయనకు వీడ్కోలు పలికారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి డీకే అరుణ అంత్యక్రియల్లో పాల్గొని.. జవాన్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దేశానికి సేవలు అందించే జవాన్ ఆకస్మిక మరణం బాధాకరమన్నారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కాగా.. కోల్‌కతాలో విధి నిర్వహణ సమయంలో గన్ మిస్‌ఫైర్ కావడంతో విష్ణు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. కాగా కోల్‌కతా నుంచి అతడి మృతదేహాన్ని శుక్రవారం రాత్రి సీఆర్‌పీఎఫ్ అధికారులు స్వగ్రామానికి తీసుకువచ్చారు. అయితే విష్ణు మృతిపై మరో కోణం ఉందని అనుమానం వ్యక్తం అవుతుండగా.. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అయితే పోస్టుమార్టం రిపోర్టులు వచ్చాకే పూర్తిస్థాయి వివరాలు తెలిసే అవకాశం ఉందని అక్కడి అధికారులు చెబుతున్నారు.

జోగుళాంబ సన్నిధిలో లోకాయుక్త జస్టిస్ లక్ష్మణరెడ్డి



జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాల్లో ఐదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను శుక్రవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లోకాయుక్త జస్టిస్ లక్ష్మణరెడ్డి సతీసమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ కార్యనిర్వహణాధికారి పురేందర్ కుమార్, చైర్మన్ చిన్ని కృష్ణయ్య ఆలయ అర్చకులతో కలిసి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లక్ష్మణరెడ్డి దంపతులు బాలబ్రహ్మేశ్వర ఆలయంలో స్వర్ణలింగానికి అభిషేకాలు చేశారు. అనంతరం జోగుళాంబ అమ్మవారికి ఖడ్గమాల అర్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో సత్కరించారు.

రామన్‌పాడులో 1,011 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం తగ్గుతుంది. శుక్రవారం 1,011అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలియజేశారు.

ఎక్సైజ్ దాడుల్లో 2,600 లీటర్ల బెల్లంఊట ధ్వంసం


జయప్రకాష్ తండాలో బెల్లం ఊటను పారబోస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

కల్వకుర్తి రూరల్: కల్వకుర్తి ఎక్సైజ్ సరికిల్ పరిధిలో పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని శుక్రవారం ప్రత్యేక దాడులు నిర్వహించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ నాగర్‌కర్నూల్, కల్వకుర్తి ఎక్సైజ్ పోలీసులు సంయుక్త దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 2,600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 21 లీటర్ల సారా, 20 కిలోల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. 4 కేసులు నమోదు చేశారు. జయప్రకాష్‌నగర్ తండా, భగత్‌సింగ్‌తండా, తర్నికల్‌తండా పరిధిలోని దాడులు చేశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి మాట్లాడారు. సారా, అక్రమ మద్యం అమ్మకాలపై నిరంతరం దాడులు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బాలకృష్ణారెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ అరుణ, కల్వకుర్తి ఎస్‌ఐ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

10 మందిపై కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడుకు చెందిన విక్రమాచార్యులు తన స్థలంలో ఏర్పాటు చేసుకున్న షెట్టర్, కంచెను తొలగించిన 10 మందిపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. రేణుక ఎల్లమ్మ ఆలయం వద్దనున్న తన స్థలంలో విక్రమాచార్యులు షెట్టర్, కంచె ఏర్పాటు చేసుకోగా.. ఈనెల 24న గ్రామానికి చెందిన పాముల ఆంజనేయులు, మరో 9 మంది గొడవ పడి, ఆయా నిర్మాణాలను తొలగించారని పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేపతో సస్యరక్షణ సమగ్ర పోషణ

పాడి–పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్


వేప పొడి


వేప చెక్క


వేప చెట్టు

అలంపూర్: వేప ఉత్పత్తులను పంటల సస్యరక్షణలో సమగ్ర పోషక యాజమాన్యంలో ఉపయోగిస్తారు. కీటకాలను సమర్థవంతంగా ఎదుర్కొనే అజాడి రక్టిన్ పదార్థం వేప గింజలో ఎక్కువగా ఉంటుందని ఏడీఏ సక్రియ నాయక్ తెలిపారు. దీనిలో వేప గింజల నుంచి వేప పిండిని తయారు చేసి పంటలకు ఉపయోగించవచ్చని తెలిపారు. వేప పిండిలో ఉండే లక్షణాలు, ఉపయోగాలను ఆయన రైతులకు వివరించారు.

ఆహార ధాన్యాల్లో

వరి పంటలో వేప పిండిని యూరియాతో 5:1 నిష్పత్తిలో చల్లితే త్వరగా చీడపీడలు ఆశించవు. 30 శాతం నత్రజని ఆదా అవుతుంది. మొక్కలు నత్రజని తీసుకునే శక్తిని పెంచవచ్చును. ఎకరానికి 80 కిలోల వేప పిండిని వాడితే కాయ తొలుచు పురుగు, ఉల్లి కోడును నివారించవచ్చు.

కంది, పెసర, మినుము, ఆముదం పంటల్లో ఎకరానికి 80 కిలోల వేప పిండి వాడటం వలన పురుగుల బెడద తగ్గించవచ్చు. ఐదు శాతం వేప కషాయం పిచికారీ చేయడం వలన రెక్కల పురుగుల గుడ్లు పొదగవు.

- వేరుశనగలో ఎకరానికి వంద కిలోల వేప పిండి వాడటం వలన వేరు పురుగు, వేరు కుళ్లు, కాయకుళ్లు తెగులు నివారించవచ్చు.

కూరగాయ పంటల్లో

టమాటలో ఎకరానికి 200 కిలోల వేప పిండి వేయడం వలన పూత రాలడం, కాయ తొలుచు పురుగులను తగ్గించవచ్చును. టమాటను ఆశించే పాము పొడ పురుగును వేప పిండితో తయారు చేసిన 50 శాతం ద్రవాన్ని మొక్కలు నాటిన 10 నుంచి 15 రోజుల్లో పిచికారి చేయడం వలన నివారించవచ్చు.

- కాలీఫ్లవర్‌లో ఎకరానికి వంద కిలోల వేప పిండి వాడటం వలన కుళ్లు తెగులు రాకుండా నివారించవచ్చు.

వాణిజ్య పంటల్లో

పత్తిలో ఎకరానికి 50 కిలోల వేప పిండి వాడటం వలన వేరుకుళ్లు వ్యాధిని పూర్తిగా అరికట్టవచ్చు. యూరియాలోని నత్రజనిని ఎక్కువ కాలం అందుబాటులో ఉండి పూర్తి స్థాయిలో నత్రజని వినియోగించుకుంటాయి.

పండ్ల తోటల్లో

మామిడి, బత్తాయి తోటల్లో మూడు కిలోల వేప పిండిని ఏడాది వయస్సు ఉన్న మొక్కలను వాడాలి. దీని వలన కాండం తొలుచు, వేరు తొలుచు పురుగులను నివారించుకోవచ్చు. పూత వచ్చే, పిందె సమయంలో 5 శాతం వేప ద్రావణం పిచికారి చేసి చీడ పీడల నుంచి కాపాడుకోవచ్చు.

పూల తోటల్లో

పూల తోటలైన కనకాంబరం, లిల్లీ, మల్లే తోటల్లో వేప పిండిని వాడటం వలన నులిపురుగులను సమర్థవంతంగా నివారించుకోవచ్చు.

వేప పిండిలో పోషకాలు

వంద కిలోల వేప పిండిలో 3.56 కిలోల నత్రజని, 0.83 కిలోల భాస్వరం, 1.67 కిలోల పొటాషియం ఉంటుంది. వీటితోపాటు కాల్షియం, మెగ్నీషియం కూడా ఉంటాయి. ఐదు కిలోల వేప పిండిని 200 లీటర్ల నీటిలో 12 గంటలు నానబెట్టి దానిని పలుచటి గుడ్డతో వడగట్టి వచ్చిన ద్రవాన్ని పంటలకు పిచికారి చేస్తే అనేక లాభాలు ఉన్నాయి.

విస్తృతంగా తనిఖీలు.. భారీగా నగదు పట్టివేత



మరికల్‌లో పట్టుబడిన నగదుతో సీఐ రాజేందర్‌రెడ్డి


అడ్డాకుల టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్న నగదుతో ఎస్‌ఐ శ్రీనివాస్

మరికల్/హన్వాడ/అమరచింత/అడ్డాకుల/గోపాల్‌పేట: పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యాప్తంగా చెక్‌పోస్టుల వద్ద పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. శుక్రవారం పలు చెక్‌పోస్టుల వద్ద పోలీసుల తనిఖీలు నగదు, మద్యం పట్టుబడింది.

- మరికల్‌లోని లాల్‌కోట చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా రూ. 8.40లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. దేవరకద్ర మండలం గురకొండ చెందిన కింగురి బీరప్ప కారును పోలీసులు తనిఖీ చేయగా అందుల్లో ఈ నగదును గుర్తించారు. ఆధారాలు చూపించకపోవడంతో సీజ్ చేసినట్లు సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు.
- హన్వాడ మండలంలోని నాగినోనిపల్లి శివారులోని ప్రధానరహదారిపై నిర్వహించిన తనిఖీల్లో నారాయణపేటకు జిల్లా గుండుమాల్ మండలం బోగారం చెందిన జనుపాల అంజిలయ్య నుంచి రూ.95వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ పేర్కొన్నారు.
- అమరచింత మండలంలోని నాగల్‌కడ్మూర్ వద్ద వెంకటేష్ నుంచి రూ.80 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ సురేష్‌కుమార్ తెలిపారు.
- అడ్డాకుల మండలంలోని శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద సరైన పత్రాలు లేకుండా కారులో తరలిస్తున్న నగదును పట్టుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని హోస్పేట్‌కు చెందిన ఆదిల్ నవాజ్ కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా శుక్రవారం సాయంత్రం టోల్‌ప్లాజా వద్ద కారును ఆపి తనిఖీ చేసినట్లు చెప్పారు. కారులో ఉన్న రూ.1.16లక్షల నగదుకు సరైన పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.
- వనపర్తి జిల్లా సరిహద్దు బుద్దారం గండి చెక్‌పోస్ట్ వద్ద రూ.1.90లక్షలు నగదు సీజ్ చేసినట్లు గోపాల్‌పేట ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. బిజినేపల్లి మండలం లింగసానిపల్లికి చెందిన సత్యనారాయణ కారులో వనపర్తికి వెళ్తుండగా ఈ నగదు పట్టుకున్నట్లు పేర్కొన్నారు.